ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

వెంకటాపూర్, జూలై 15 : ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి చేర్చాలని తెలంగాణ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రకాశ్ పిలుపు మేరకు సోమవారం జిల్లా మత్స్య శాఖ సహకార సంఘం అధ్యక్షుడు సాదు రఘు, ముదిరాజ్‌లతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిని హామీ నిలబెట్టుకోవాలని కోరారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి నర్సయ్య, పిట్టల వెంకటస్వామి, గౌరవ అధ్యక్షుడు వెంకటమల్లయ్య, డైరెక్టర్ ఐలయ్య, నర్సయ్య, రాజ్‌కుమార్, సారంగపాణి, రాజు, గణపతి, కోటయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పుట్ట మధు

బాధిత కుటుంబానికి పుట్ట మధు పరామర్శ

మహదేవపూర్, జూలై 15 : మండల కేంద్రానికి చెందిన ఎనగంటి సమ్మయ్య తల్లి ముత్తమ్మ ఇటీవల మృతి చెందగా బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్‌రావు, సీనియర్ నాయకులు పెండ్యాల మనోహర్, కడార్ల శంకర్, పలిమెల మండలాధ్యక్షుడు జవ్వాజి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వరదలపై అవగాహన

గోవిందరావుపేట, జూలై 15 : మండలంలోని రాఘవపట్నం గ్రామస్తులకు సోమవారం పస్రా ఎస్సై కమలాకర్ వరదలపై అవగాహన కల్పించారు. వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా ప్రమాదం అనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గుడిసె వాసులు

పట్టాల కోసం కలెక్టరేట్ ముట్టడి

ములుగు రూరల్, జూలై 15 : మండలంలోని ఇంచర్ల శివారులోని అంబేద్కర్ నగర్ వద్ద ఏర్పాటు చేసుకున్న గుడిసెలకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ గుడిసె వాసులు సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. అక్కడే ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి జంపాల రవీందర్, అంబేద్కర్ భవన్ విగ్రహ నిర్మాణ సమితి చైర్మన్ నెమలి నర్సయ్య మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇల్లు లేని ప్రతి పేదవాడికి ప్రభుత్వమే ఇంటి స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇంటిని నిర్మించి ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు. మంత్రి సీతక్క సొంత నియోజకవర్గంలో అన్ని కులాల ప్రజలు అంబేద్కర్ నగర్‌లో పదేళ్లుగా గుడిసెలు వేసుకొని ఉంటున్నారని, వారందరికీ పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు వావిలాల స్వామి, కుమార్‌యాదవ్, జాడి మల్లీశ్వరి, సర్వర్, గాదె రవి, జాశ్వా, సావిత్రి, రజిత, అంకూస్ పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

గుడిసెల కూల్చివేతలను నిలిపివేయాలి

ఏటూరునాగారం, జూలై 15 : ఆదివాసీల గుడిసెలను తొలగించడం నిలిపివేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు వట్టం ఉపేందర్ కోరారు. మండలంలోని శంకరాజుపల్లికి చెందిన ఆదివాసీలు అల్లంవారి ఘన్‌పూర్ సమీపంలో పోడు భూమిలో వేసుకున్న గుడిసెలను అటవీశాఖ అధికారులు తొలగించిన విషయం తెలుసుకున్న తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ నాయకులు బాధితులతో మాట్లాడారు. అటవీ శాఖ అధికారులు దాడులకు పాల్పడకుండా రక్షణ కల్పించాలని మంత్రి సీతక్కను కోరారు. దాడులు పునరావృతం అయితే సంఘం తరపున ఉద్యమించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. నాయకులు ముద్దబోయిన రవి, కబ్బాక శ్రావణ్, కొప్పుల రవి, నీలాద్రి ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★ వరంగల్ హైవేలోని ఆలేరు-కొలనుపాకలో ఓపెన్ ప్లాట్లు మరియు ఫార్మ్‌ల్యాండ్ ప్లాట్లు అమ్మబడును. సాగర్ హైవేలో ఇండస్ట్రియల్ ఏరియాగా అభివృద్ధి చెందుతున్న యాచారంనందు ఓపెన్ ప్లాట్లు కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్ & క్లియర్ టైటిల్. Ph: 7989747927.
NT-325882

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

టేకుమట్ల, జూలై 15 : మండలంలోని గర్మిళ్లపల్లి శివారు కలికోటపల్లి నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఆర్ఐ సంతోష్ తెలిపారు. మండలంలోని కలికోటపల్లి, రేగొండ మండలం కోటంచ గ్రామానికి చెందిన గొల్లెన సాంబయ్య, రమేశ్, కుమార్, శ్రీనివాస్ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా రెవెన్యూ సిబ్బంది గంధం సురేశ్, రాజుతో కలిసి పట్టుకున్నట్లు చెప్పారు. ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

ములుగు, చిట్యాల, కాటారంలో పోలీసులు అదుపులోకి తీసుకున్న పలు పార్టీల నాయకులు

ఎక్కడికక్కడే నిర్బంధం

- సచివాలయ ముట్టడి నేపథ్యంలో ముందస్తు అరెస్టులు
- పోలీస్‌స్టేషన్లకు విద్యార్థి నాయకుల తరలింపు

ములుగు రూరల్/ మహదేవపూర్/ చిట్యాల/కాటారం, జూలై 15 : డీఎస్సీని వాయిదా వేయాలని, గ్రూపు 1,2 పోస్టులు పెంచాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగుల ఆధ్వర్యంలో సోమవారం తలపెట్టిన సచివాలయ ముట్టడి నేపథ్యంలో విద్యార్థి సంఘం నేతలను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఆదివారం అర్ధరాత్రి వారిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్లకు తరలించారు. మహదేవపూర్ మండలంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు రాంశెట్టి మనోజ్, జిల్లా ఉపాధ్యక్షుడు లింగంపల్లి జోగేశ్వర్ రావు, కార్యదర్శి బల్ల సంపత్, ఏవీబీపీ నగర కార్యదర్శి పేట సాయి, నాయకులు గోగుల కృష్ణ, రవితేజ, సుశాంత్, వెంకటేశ్, సంజయ్ అరెస్టు చేశారు. చిట్యాలలో బీఆర్ఎస్ యూత్ మండల మాజీ అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమకారుడు జన్నె యుగేంధర్, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్, బీజేవైఎం జిల్లా నాయకుడు గొర్రె శశికుమార్, ఏబీఎస్ఎఫ్ నాయకులు గోల్కొండ సురేశ్, బీజేవైఎం యువ మోర్చ మండల నాయకుడు జానర్ల కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాటారం మండలంలో ఎస్సై అభినవ్ ఆధ్వర్యంలో ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలను సోమవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సాయంత్రం సొంత పూచికత్తుపై విడిచిపెట్టారు. ముందస్తుగా అరెస్టయినవారిలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పాగె రంజిత్ కుమార్, బీజేపీ నాయకులు దుర్గం తిరుపతి, కొండ రాజేందర్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆత్మకూరి స్వామి యాదవ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు సంతోష్, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు రామిళ్ల రాజబాబు ఉన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో గిరిజన మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, యువ మోర్చ జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజు, నాయకులు ఎల్కతుర్తి శివ, కల్లెపు ప్రవీణ్, ఎనుముల మహేశ్, బోగిరి రాకేశ్, ఇర్సవడ్ల నాగసాయి, నూనేటి రంజిత్ ఉన్నారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులు, నిరుద్యోగులు, విద్యార్థి నాయకులను అరెస్టు చేయడం సిగ్గు చేటన్నారు. ఉద్యోగాల కోసం ఆమరణ దీక్ష చేస్తున్న ఉస్మానియా విద్యార్థి నాయకుడు మోతీలాల్, నిరుద్యోగులపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ ఉద్యోగాలు పెంచాలని శాంతియుతంగా అడుగుతుంటే అరెస్టులు చేయడం సిగ్గుచేటన్నారు. రాజ్యాంగానికి లోబడి శాంతియుతంగా ధర్నాలు, నిరసన చేపట్టే హక్కును పోలీసులు కాల రాస్తున్నారని మండిపడ్డారు.

కళాశాల అభివృద్ధిపై సమావేశం

వెంకటాపురం(నూగూరు), జూలై15 : మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాల అభివృద్ధిపై అఖిల పక్ష నాయకులు, గ్రామస్తులు సోమవారం కళాశాలలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల తక్షణ అవసరాలైన బెంచీల ఏర్పాటుకు కాంగ్రెస్ నాయకులు రూ.20వేలు, సీపీఎం నాయకులు రూ.10వేలు, 1977-78 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల తరపున చిట్టెం టాకయ్య రూ.20 వేలు ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ దివాకర ప్రత్యేక నిధుల నుంచి రూ.10 లక్షలు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అకాడమిక్ ఇన్‌చార్జి అమ్మిన శ్రీనివాస్‌రాజు, సొసైటీ అధ్యక్షుడు మోహన్‌రావు, పలు పార్టీ నాయకులు తోట మల్లికార్జునరావు, గ్యాసం వాసు, కుమ్మరి శ్రీను, వెల్పూరి లక్ష్మీనారాయణ, చిడెం శివ, కే ప్రసాద్, బొల్లెం సునీల్, రామకృష్ణ పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

కాటారం, జూలై 15 : గిరిజనులకు తెలియకుండానే వారి భూమిని కొనుగోలు చేశామని చెప్పి సాగు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా పుల్‌సింగ్ నాయక్, ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బచ్చల ఎర్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం బాధితుడితో కలిసి కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మండల కేంద్రంలో మాట్లాడుతూ గతంలో బయ్యారంలో ఉండే రామినేని లక్ష్మయ్యకు కంబాల్‌పాడ్ శివారులో 7.14 ఎకరాలు ఉండేదన్నారు. ఆంధ్ర ప్రాంతం నుంచి వలస వచ్చిన కొందరికి కౌలు కిచ్చాడన్నారు. లక్ష్మయ్య కుటుంబం మహాముత్తారం వెళ్లగా కొందరు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తప్పుడు సాదాబైనామాతో ఆర్ఓఆర్ చేయించుకున్నారని ఆరోపించారు. లక్ష్మయ్య అతడి కుమారుడు బాలయ్య మృతి చెందగా మనవడు వెంకట్రాజంను బెదిరించి పంటను ధ్వంసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు, తుడుందెబ్బ నాయకులు ప్రభాకర్, సురేందర్, కిరణ్, పోచయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ అధికారులను బదిలీ చేయాలి

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ జిల్లా కమిటీ సభ్యుడు మహేశ్ నాయక్

ములుగురూరల్, జూలై15 : ఏటూరునాగారం ఐటీడీఏలో ఏండ్ల తరబడి విధులు నిర్వర్తిస్తున్న అధికారులను బదిలీ చేయాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ జిల్లా కమిటీ సభ్యుడు నూనవత్ మహేశ్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ దళారులను నియమించుకొని ప్రతీ పనికి అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సామాన్యులకు అందకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కొన్నేళ్ళుగా పాలకమండలి సమావేశం నిర్వహించకుండా గిరిజనులను చిన్న చూపు చూస్తున్నారని తెలిపారు. మంత్రి సీతక్క, కలెక్టర్ చొరవ తీసుకొని ఐటీడీఏను ప్రక్షాళన చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ సేవా సమితి నాయకులు అశోక్‌నాయక్, మురళి, పవన్, చంటి, దస్రు, రాందాస్, లాల్‌సింగ్, రాహుల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి ఆర్థిక సాయం

చిట్యాల, జూలై 15 : మండల కేంద్రానికి చెందిన గుర్రపు గట్టయ్య గత ఏడాది ప్రమాదశాత్తు తాటిచెట్టు పైనుంచి కింద పడడంతో నడుము విరిగింది. దవాఖానకు తీసుకెళ్లి ఆపరేషన్ చేయించినా మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న చిట్యాల పోలీస్ స్టేషన్ కానిస్టేబుళ్లు సోమవారం బాధితుడి ఇంటికి వెళ్లి 25 కిలోల బియ్యం, రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కానిస్టేబుల్స్ సిద్ధార్థ, లాల్ సింగ్, వెంకటేశ్, సుమన్, రాజేందర్, అనిల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల అందజేత

మంగపేట, జూలై 15 : మండలంలోని కమలాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు అమెరికాకు చెందిన సిన్సినాటి ఫ్రెండ్స్ గ్రూపు ఆధ్వర్యంలో సోమవారం 150 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గడ్డి శ్రీనువాస్, ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అనిత, టీచర్లు ప్రసాద్, సునీత, లక్ష్మి, భూలక్ష్మి, వేణు మాధవ్, రమేశ్, నర్సింగారావు, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

రామప్పలో హెరిటేజ్ వాక్

- కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ
- పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

వెంకటాపూర్, జూలై 15 : రామప్ప దేవాలయంలో కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సోమవారం కేంద్ర పురావస్తు శాఖ, రాష్ట్ర పర్యాటక శాఖ, యువ టూరిజం క్లబ్, స్థానిక పాఠశాలల సహకారంతో హెరిటేజ్ వాక్ నిర్వహించారు. ఈ నెల 21 నుంచి 31 వరకు వరల్డ్ హెరిటేజ్ కమిటీ సమావేశాలకు భారతదేశం ఆతిథ్యం ఇస్తున్న సందర్భంగా కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో దేశంలోని వారసత్వ కట్టడాల్లో హెరిటేజ్ వాక్ నిర్వహిస్తున్నది. ఈ సందర్భంగా ఆలయం నుంచి గొల్లగుడి, పార్కింగ్ స్థలంలోని శివాలయం వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించారు. అనంతరం కేంద్ర పర్యాటక శాఖ అధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయం, తత్వశాస్త్రం, పురాణాలు, వారసత్వ కట్టడాల పరిరక్షణను వివరించారు. ముందు తరాలకు వారసత్వ కట్టడాలను అందించాలంటే ప్రతి ఒక్కరూ వాటి పరిరక్షణకు పాటు పడాలన్నారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ రామప్ప కో ఆర్డినేటర్ సీహెచ్ కుమారస్వామి, రాజేశ్, శ్రీనివాస్, సోహైల్, సతీశ్, మాధవ్, నాగరాజు, అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు వినతులు

ములుగు రూరల్, జూలై 15 : ములుగు మండలంలో సోమవారం పర్యటించిన మంత్రికి పలువురు వినతులు సమర్పించారు. మహ్మద్‌గౌస్‌పల్లి పర్యటనలో మైనార్టీలు గ్రామంలో కబరస్తాన్, ఈద్గా ప్రహరీ, సీసీ రోడ్డు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మైనార్టీ పెద్దలు మహ్మద్ మైబు, మహ్మద్ గఫూర్ తెలిపారు. వారి వెంట నాజర్, జలీల, ఘనిబ్, ఇబ్రహీమ్, అజారుద్దీన్ ఉన్నారు. అలాగే ములుగులో మంత్రి సీతక్కకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని వినతిపత్రం సమర్పించారు.

ఆర్థిక సాయం

ములుగు రూరల్, జూలై 15 : మండలంలోని సర్వాపురం గ్రామానికి చెందిన పసుల నర్సక్క అనారోగ్యంతో మృతి చెందింది. అంబేద్కర్ గ్రూప్ సభ్యులు సోమవారం రూ.16వేల ఆర్థిక సాయం అందించారు. జీ రవిగౌడ్, ఏ ఐలయ్య, బాగె రాజు, భిక్షపతి, మహేందర్, నర్సింహరాములు, చంద్రమొగిలి, మహేందర్, రామారావు, లక్ష్మణ్, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

ర్యాలీ తీస్తున్న ఏసీడీపీవో ముత్తమ్మ, చిన్నారులు, తల్లులు

వెంకటాపురం (నూగూరు)/ వెంకటాపూర్, జూలై 15 : చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని ఏసీడీపీవో ముత్తమ్మ అన్నారు. సోమవారం అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని బర్లగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రారంభించారు. ముత్తమ్మ మాట్లాడుతూ 3-6 సంవత్సరాల పిల్లలకు ఇంగ్లిష్ మీడియం విద్య అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి మౌనిక, సెంటర్ టీచర్, సూపర్‌వైజర్ పుష్పవతి, రమాదేవి పాల్గొన్నారు. అలాగే వెంకటాపూర్ మండలం నర్సింగాపూర్‌లో అంగన్‌వాడీ టీచర్ ఎర్రబెల్లి సరోజన, వీవోఏ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మహమ్మద్ సర్వర్ అహ్మద్, పంచాయతీ సెక్రటరీ అనిత, అంగన్వాడీ ఆయా భవానీ, తల్లి దండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహదేవపూర్‌లో..

మహదేవపూర్ : పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలని టీచర్లు తల్లులకు సూచించారు. సోమవారం మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లులతో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రీస్కూల్ విద్యా విధానం, అంగన్‌వాడీ సేవలను వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు సత్యవాణి, పీ సుజాత, డీ నాగలత, పర్జానా, సునీత, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

- సమస్యలు పరిష్కరించాలి
- భూపాలపల్లి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

భూపాలపల్లి రూరల్ : బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

భూపాలపల్లి రూరల్, జూలై 15 : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణిలో వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 74 మంది ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారని, వాటిని ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేసినట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న ప్రజావాణి నుంచి జిల్లాకు వచ్చిన దరఖాస్తులు వారం రోజుల్లో పరిష్కరించి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో విజయలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ములుగు రూరల్ : బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ శ్రీజ

దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దు

ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ

ములుగు రూరల్ : ప్రజావాణి ఫిర్యాదులను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉంచొద్దని అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మహేందర్ జీతో కలిసి ఆమె ప్రజావాణి దరఖాస్తులను స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించినవి 34, పింఛన్ల కోసం 6, డబుల్ బెడ్‌రూమ్ కోసం 8, ఇతర శాఖలకు సంబంధించి 27 వినతులు వచ్చాయని తెలిపారు. పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆమె అధికారులతో మాట్లాడారు. వరదల సమయంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సూచించిన జాగ్రత్తలు, నిబంధనలు తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో భూ సమస్యలపై వినతులు

మహదేవపూర్/ టేకుమట్ల : తహసీల్ కార్యాలయల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సంబంధిత సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. మహదేవపూర్ మండలంలోని 46 మంది రైతులు, టేకుమట్ల మండలంలో 6 దరాఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్లు ప్రహ్లాద్ రాథోడ్, విజయలక్ష్మి వెల్లడించారు. కార్యక్రమంలో టేకుమట్ల ఆర్ఐ సంతోష్, సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా ■ ఐటీడీఏలో గిరిజన దర్బార్

ఏటూరునాగారం, జూలై 15 : గిరిజన దర్బార్‌లో సమర్పించిన దరఖాస్తులకు సత్వరమే పరిష్కారం చూపాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా అధికారులకు సూచించారు. సోమవారం ఐటీడీఏలో గిరిజన దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీవో వసంతరావు, ఏవో దామోదర్‌స్వామి, డీడీ పోచం, ఎస్‌వో రాజ్‌కుమార్, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, ఆర్‌సీవో రాజ్యలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతి కుమార్, వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

మహదేవపూర్ అడపకుంటలో చేరిన వరద

జయశంకర్ జిల్లాలో 29 మి.మీ వర్షపాతం

భూపాలపల్లి రూరల్, జూలై 15 : భూపాలపల్లి జిల్లాలో సోమవారం ఉదయం 8.30 గంటల వరకు 29 మి.మీ సగటు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని మహదేవపూర్ మండలంలో అత్యధికంగా 109.2 మి.మీ మహాముత్తారంలో 24.8 మి.మీ, పలిమెలలో 34.2 మి. మీ, కాటారంలో 101.6 మి.మీ, మల్హార్ రావు లో 42.8 మి.మీ, టేకుమట్లలో 85.8 మి.మీ, మొగుళ్లపల్లిలో 28.6 మి. మీ, చిట్యాలలో 37.2 మి. మీ, రేగొండ లో 7.4 మి.మీ, గణపురంలో 6.2 మి,మీ, భూపాలపల్లి మండలంలో 6.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వారు వివరించారు.

మహదేవపూర్ మండలంలో భారీ వర్షం

మహదేవపూర్ : మండల కేంద్రంతో పాటు బొమ్మాపూర్, ఎల్కేశ్వరం, సూరారం, బెగ్లూర్, బ్రాహ్మణపల్లి, రాపల్లికోట, ఎన్కపల్లి, అంబట్‌పల్లి, పెద్దంపేట, కుదురుపల్లి, ఎడపల్లి గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో పలు చెరువుల్లోకి నీరు చేరింది. కొన్ని రోజులుగా వర్షాలు సరిగా రాక దిగులు చెందుతున్న రైతన్నలు భారీ వర్షంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

బోగస్ మత్స్యకారులను తొలగించాలి

మహదేవపూర్, జూలై 15 : బోగస్ మత్స్యకారులను తొలగించి, అర్హులకు న్యాయం చేయాలని మండల కేంద్రంలోని గంగపుత్రులు డిమాండ్ చేశారు. సోమవారం గంగపుత్ర సంఘానికి చెందిన 60 కుటుంబాలు ఎర్ర మందరం, కొత్త చెరువుల్లో చేపపిల్లలు పోసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు నాగుల ధర్మయ్య, రాసకట్ల మురళి మాట్లాడారు. 20 ఏండ్లుగా మహదేవపూర్ మత్స్యకార సొసైటీలో గంగపుత్రులకు సభ్యత్వం ఇవ్వకపోవడంతో తమకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యత్వం లేకపోవడంతో తమకు జీవనోపాధి ఇబ్బందిగా మారిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గంగపుత్రులు, ముదిరాజ్‌లకు వివాదంగా ఉన్న సొసైటీలను సంప్రదించి కమిటీ వేసి అందరూ కలిసి చేసుకోవాలని సూచించినా అమలు కావడం లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముద్రగడ వెంకట్రాజం, కాపరబోయిన రామస్వామి, ముద్రగడ సురేశ్, గరిగె ప్రసాద్, సంతోష్, నాగుల గట్టయ్య, రఘు, శివ, సతీశ్, నాగరాజు, మధూకర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సింగిల్ విండో చైర్మన్‌గా మొండయ్య

మల్హార్, జూలై 15 : తాడిచర్ల సింగిల్ విండో చైర్మన్‌గా ఇప్ప మొండయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రాజు తెలిపారు.